సు: వెడుతున్నారా, వెడుతున్నారా, వెళిపోతున్నారా?—(ఏడుస్తుంది.)

*　　*　　*

యు: (ఆందోళనగా) అయ్యయ్యో, తర్వాతేం జరిగింది తాతా?

తా: ఆ అమాయకురాలు అల్లాగే ఏడుస్తూ అతనివంక చూస్తూ నిలబడిపోయింది. పడిపోయింది. చనిపోయింది.

యు: పాపం.

తా: అప్పుడు జాలి దలిచింది ఈ చెట్టు ఒక్కటే తన చల్లని నీడకప్పి, ఆకుల కన్నీళ్ళురాల్చి తనుగూడా ఏడ్చింది. దీవించింది. అందుకే ఎప్పుడూ నేను దీనిదగ్గరే వుంటూ, నీరుపోసి పెంచుకుంటూ, ప్రేమగా చూసుకుంటూ వుంటూ.

యు: తాతా పాపం అతనిదిగూడా ఏమీ తప్పులేదనే అనుకుంటూ. తనకే గడవనప్పుడు ఆ అమ్మాయిని తీసుకుపోయి కష్టపెట్టడం గూడా అన్యాయమేగా?

తా: తప్పకుండా. ఆమెను మనసారా ప్రేమించబట్టే అట్లా చేశాడుగాని, అతనిలో మరేమీ ఉద్దేశంలేదు, బాబూ! అసలు ప్రేమించడమనేదే మనుష్యుల్లో అగ్నిజ్వాలలు వెలిగించడం లాంటిది. కొంతమంది ఆ కాంతిలో ఎంతో సుఖంగా కాలం వెళ్ళబుచ్చుతారు. కొంతమంది ఆ వేడికి తాళుకోలేక గతించిపోతారు.

యు: అవును తాతా, పాపం, ఈ కథ విన్నవాళ్ళెవ్వరూ వాళ్ళిద్దర్నీ మరిచిపోలేరు. ఊఁ, ఎండ కొంచెం తగ్గినట్టుంది. నేను వెళ్ళొస్తా.

తా. మంచిది బాబూ! (పిలుస్తూ) బాబూ.

యు: ఏమిటి తాతా?

తా. ఈ కథ నేనెవరికి చెప్పినా వాళ్ళిద్దరినీ మెచ్చుకుంటారే, మరి ఆ రామయ్య ఏమైపోయాడని అడగరేం?

యు: రామయ్యా! ఆ, నేను మరిచేపోయాను. ఆ తర్వాత అతనేంచేశాడు?

తా. అతనిప్పటికీ బ్రహ్మచారిగానే వుంటూ ఆ అమ్మాయిని తలచుకుంటూ జీవితం గడుపుతున్నాడు.

యు: అట్లాగా! వాళ్ళిద్దరి ప్రేమకూ అతని జీవితాన్ని అర్పించాడు. అసలు ఈకథంతటిలోనూ నిజమైన త్యాగం చేసింది అతనే తాతా.

తా: బాగా చెప్పావ్ బాబూ, నీకు నూరేళ్ళాయుష్షు. ఆ రామయ్యను నేనేబాబూ.

(ఆలిండియారేడియో ప్రసారితం)

---

కథానిక

# స్మృతిపథంలో ఛాయామూర్తి

"రాజా"

ఇంకా సాయంకాలం అవలేదు. ప్రకృతిఅంతా అదోలా వుంది. తనుకూడా రాధను మూగగా బ్రతిమాలుతోందా అన్నట్టువుంది. దొడ్లోవున్న పున్నాగచెట్టు తన సందేశాన్ని పూల ద్వారా పంపిస్తోంది రాధ దగ్గరకు.

"రాధా, నువ్వు ఇందుకు వప్పుకోకపోతే ఎల్లాగమ్మా, చెప్పుతల్లీ నువ్వే చెప్పు ఏదైనా వుపాయం. మనకి వేరే మగదిక్కు లేరాయెను. మరి ఇంత కన్నా ఏం చేస్తాం." బ్రతిమాలుతోంది తల్లి. బ్రతిమాలడం కాదు ప్రాధేయపడడమే.

ఆవిడన్నట్టు వాళ్ళకి ప్రకాశంకన్న వేరే దిక్కు ఎవ్వరూ లేరు. అతనికైనా ప్రస్తుతం ఇంకెవ్వరూ లేరు. రాధ తండ్రి పోయినప్పటినుంచీ వీళ్ళిద్దరూ, ఇంకో చెల్లెలూ, తమ్ముడూ ప్రకాశం ఇంట్లోనే వుంటున్నారు. అతనైనా అల్లుడు మాత్రమే కాకుండా మేనల్లుడుకూడాను.

ఆరునెలలైంది రాధ అక్క వసుంధరపోయి. ఒక మగ నలుసును భూమ్మీద పడేసి బాలింతప్పుడే పోయింది. అప్పట్నుంచీ చుట్టాలంతా అడపాదడపా అంటూనే వున్నారు ఇహ రాధను ప్రకాశానికివ్వమని.

"బావ ససేమిరా వద్దంటే వద్దంటున్నా ఎల్లాగో

వప్పించారమ్మా అంతాను. ఇప్పటికైనా అతను సరే అనలేదుట. మౌనం అర్ధాంగీకారంగా తీసుకున్నారుట. మరి ఇప్పుడిహ ఆలశ్యంచేస్తే మళ్ళీ అతనికేం తిక్కవస్తుందో" దూరం ఆలోచించి అంటోంది తల్లి.

కాని పద్ధెనిమిదేళ్లు నిండని రాధ కన్నెమనసు బావను చేసుకోడానికి వప్పుకోడంలేదు.

"ఏవమ్మా ఏమంటావ్ బావకు వయసుమాత్రం తీరిపోయిందా పట్టుమని ముప్పైఏళ్ళు లేవు." ఎల్లాగో సర్దాలని చూస్తోంది తల్లి.

"అమ్మా" రాధ కంఠం గద్గదమైంది. ఇకపైన మాట నోట్లోంచి పెకిలిరాలేదు."ఏవమ్మా ఏమిటి?"

"వద్దమ్మా నే బావను చేసుకోలేనమ్మా. మొన్న మొన్నటి దాకా అక్క తిరిగిన స్థానంలో ఇవాళ నే తిరగలేనమ్మా." కళ్ళనీళ్ళు తుడుచుకుంది రాధ. అక్క పేరు వినేటప్పటికి తల్లికికూడా ఏడుపు వచ్చింది. ఒక్క ఐదు నిముషాలు నిశ్శబ్దం రాజ్యంచేసింది అక్కడ.

"చూడు రాధతల్లీ నీకు అంత తెలియని ఈడు కాదుగదా. ఇప్పుడు బావని నువ్వు చేసుకోకపోతే ఇంకెవరన్నా కళ్ళకద్దుకుంటూ పిల్లనిస్తారు. అప్పుడు మనం ఇక్కడ వుండగలమా చెప్పు, అక్క కాబట్టి సరిపోయిందిగాని ఆ వచ్చేది మనల్ని వుండనిస్తుందా? ఇంక అక్కపోతూ బాబును మన చేతుల్లో పెట్టింది. ఇంకెవత్తైనావస్తే అది వాణ్ని సరిగా చూస్తుండంటావా చెప్పు?"

"అమ్మా నువ్వు నిజంగా వాడిమీది ప్రేమకొద్దీనా నన్ను బావకిస్తానంటున్నావు. దాన్లో ఎంత స్వార్థంవుందో నాకు తెలుసు నువ్వు నిజంగా తల్లివైనా మామీదే కనుక ప్రేముంటే ఇల్లా చెయ్యమంటావా?"

రాధకి కోపంరాదు. వచ్చిందా అంటే ఏమంటుందో తనకో తెలియదు. ఉద్రేకం ఎంతపనైనా చేయిస్తుంది.

"రాధా" తల్లికేకతో ఆగింది రాధ.

"రాధా, నిన్ను బావకివ్వమనుకో. ఎక్కడన్నా వెళ్ళాలి మనం. అంతేగా? నువ్వూ చదువుకుంటున్న అందరు ఆడపిల్లలలాగే వుద్యోగం చేస్తానంటావు. అంతేగా. ఇంటర్ చదువుతున్న నువ్వు ఏం ఉద్యోగం చేసి ఎంత సంపాదిస్తావ్? ఇటు చెల్లెల్ని, అటు తమ్ముణ్ని చదివించాలి. ఇహ నీకు పెళ్ళా అంటే అదిమాత్రం మనసాధ్యమా? చెప్పు. నేను ఎంత ఆలోచించి అన్నానో. నాకు మాత్రం..."

"అమ్మా"

"నాకుమాత్రం నిన్ను రెండోపెళ్ళివానికివ్వడం ఇష్టమా? నాలో ఎన్ని మాటల్ని పైకిరానివ్వకుండా ఆపుకుంటున్నానో నీకేం తెలుసు?"

"అమ్మా"

"నీకు వేరే సంబంధం వెతకాలన్నా మనం అంతకన్నా మంచిది తేగలమా? ఇదంతా నా స్వార్థంకదూ. నాకోసం చేస్తున్నదేగదూ?"

"అమ్మా ఏదో అనేశాను. క్షమించమ్మా. నేను ముందూ వెనకా ఆలోచించకుండా అనేశాను నిన్ను మాటలు. క్షమించమ్మా" పశ్చాత్తాపం వెల్లువుతుంది రాధహృదయంలో. కాని చూస్తూ చూస్తూ పెళ్ళికి మాత్రం తిరుగుబాటు చేస్తోంది.

"అమ్మా వీళ్ళసుఖంకోసం నా సుఖాన్ని కాలదన్నుకో మంటావా? ఏం అమ్మా?"

..........

"ఏం అమ్మా మాట్లాడవ్?"

"ఏం చెప్పనమ్మా. గ్రాహకం తెలిసిన నువ్వే ఇల్లా అంటే ఇకనేను చెప్పేదేమిటి? పోనీ నువ్వు బావని చేసుకోవే అనుకో అప్పుడుమాత్రం సుఖం ఏవిధంగా వస్తుంది. తమ్ముణ్ని, చెల్లెల్ని ఏంచెయ్యదల్చుకున్నావో ఆలోచించు. ఇక నేను ఇన్ని సార్లు చెప్పడం మాత్రం బాగుండా. వచ్చేవారం నాడు ముహూర్తం వుందిట. అయిందనిపిస్తే బాగుంటుంది. అంతా ఆలోచించుకు రేపు చెప్పు" లేచింది తల్లి. లోపలిగుమ్మందాకా వెళ్ళి వెనక్కు తిరిగి "మన సంసారం సంగతి కూడా ఆలోచించు" అని లోపలకు మళ్ళింది.

రాధ అల్లాగే ఆలోచిస్తూ కూర్చుంది. అవును. అమ్మమాటలన్నీ నిజమే అబద్ధంకాదు. తను బావను చేసుకోకపోతే తన చెల్లెలిపెళ్ళి ఎలాగా? తనతమ్ముడి చదువో మరి. తన అక్క చనిపోతూ తమచేతుల్లో పెట్టిన బాబునుకూడా తనుపెంచాలి. తప్పదు. వీళ్ళందరిబ్రతుకులూ, వీళ్ళందరిసుఖాలూ, తనమీద ఆధారపడి వున్నాయి.

తన ఒక్కమాట, కనీసం తను అంగీకార సూచకంగా తలతిప్పితే చాలు. వీళ్ళందరూ సుఖంగా

బ్రతగ్గలుగుతారు. వీళ్ళ భవిష్యజ్జీవితాలు సిమెంటు రోడ్డుమీంచి నడిచిపోతాయి. తన వ్యూహాలోకం లోనే తల్లిముఖం చిరునవ్వు నవ్వుతూ కన్పించింది.

లేకపోతే అది ఆలోచించడం కష్టమే. కాని వీళ్ళందరి జీవితాలకోసం, వీళ్ళ సుఖాలకోసం తన జీవితాన్ని, తన వయసునూ, వలపునూ నాశనం చేసుకోడమేనా. తనిప్పుడు బావను చేసుకుంటే తన కృష్ణమూర్తి ఏమైపోతాడు? బహుశా అతను కూడా బలవంతపెళ్ళి చేసుకుంటాడేమో. లేక పోతే...అమ్మయ్యో! తను ఆలోచించడానికే భయమేస్తోంది. ఆ మాటలు తల్చుకుంటేనే వళ్ళు గగుర్పొడుస్తోంది.

ఇప్పుడు తను నిలుపవలసినవి ఇటు కుటుంబ శాంతి సౌఖ్యాలా, అటు మనసార ప్రేమించిన కృష్ణమూర్తి జీవితాన్నా?

మళ్ళీ తల్లి వదనం కన్పిస్తోంది. భీకరంగా "రాధా నువ్వు తప్పుదారిలో పడుతున్నావ్. నువ్వు చూడాల్సింది నీ సుఖంమాత్రమేగాదు పిచ్చితల్లీ! అందరిదీ చూస్తేనే సిద్ధిని; జాగ్రత్త. బురదలో కాలుపెట్టకు, తర్వాత లాభంవుండదు."

కాని తనుమాత్రం ఏంచేస్తుంది? మరువరాని సంఘటనలు అవి—

ఏంచెయ్యాలి? ఇప్పుడు తన కర్తవ్యం ఎమిటి? తన ఒక్కతె సుఖాన్ని సునాయాసంగా బలిచెయ్యడానికి అంత మహానుభావురాలు కాదు తను. స్వార్థం అందరిలోలాగే తనలోనూ వుంది.

మళ్ళీ ఆ వదనం కన్పిస్తుంది. తనకి అర్థం కావడంలేదు. కాని చివరకు "కర్తవ్యం" అన్న మాట గట్టిగా విన్పించింది.

"రాధా!" బయటనుంచి పిలుపు.

ఉలిక్కిపడింది ఆలోచనా తరంగాలనుంచి "రా శారదా" అంటూను.

లోపలకు వస్తూనే "అలావున్నావేం ఇవ్వాళ? మరి పిక్చర్ ప్రోగ్రాం సంగతి మర్చిపోయావా?" అంది శారద.

"ఇవాళ పిక్చర్‌కి వద్దుగాని, అలా కాస్త షికారుకి వెడదాంపద. కాస్త మాట్లాడాలి."

"నా సలహా దేన్లో కావాల్సివచ్చింది. అయినా పిక్చర్ మానేటంతదా?"

"అదికాదు శారదా. నా లైఫ్ నుగురించే.నడు."

ఉన్నదున్నట్టుగానే బయల్దేరి దారిలో అంతా చెప్పింది రాధ. ఇంతలో పార్కు చేరుకున్నారు.

"ఏం చెయ్యమంటా విప్పుడు శారీ" నిర్మానుష్యంగా వున్నచోట కూర్చుంటూ అడిగింది రాధ.

"పోనీ ఎదిరించి చూడలేకపోయావా? నీకన్న వాళ్ళంతా ఎక్కుగోవేమిటి?"

"అదిచూశాకానిఎదిరించడం మంచిదిగాదేమో అనిపిస్తోంది ఇప్పుడు" దూరంగా చూస్తూఅందిరాధ.

"నీవంటి పిచ్చిది ఇప్పుడు వుండవలసిందిగాదే. చదువుకుంటూ కూడా దండగే. ఏమీ యెరగనిపల్లెటూరి మొద్దులా శ్రీరంగనీతులు మాట్లాడుతావేం?"

"అదికాదు శారదా. మనకి చదువు ఎదిరించడం నేర్పుతుందా. చదువుకుని కొద్దిగా దూరం ఆలోచించాలి కాని మనం కూడా ఇంటి పరిస్థితులిలా వున్నప్పుడు చదువుకోని వాళ్ళలా ఎదిరించడమే? ఇదేనా నీ సలహా?

"సరే. ఇంతకీ ఏంచేస్తానంటావు? బుద్ధిమంతురాల్లా బావను చేసుకుంటానంటావంతేగా?"

"ఏంచెయ్యను చెప్పు. ఇక వేరే గత్యంతరం లేదు. లేద్దామా శారదా" ఇద్దరూ నిశ్శబ్దంగా నడుస్తున్నారు ఇంటివైపు. దారిలో ఎవరింటించో "ఆనందమానంద మాయెనే. మా సీతమ్మ పెళ్ళి కూతు రాయెనే" సన్నాయి స్వరం విన్పిస్తోంది.

శారద, "ఇక వారంరోజుల్లో మా రాధమ్మ పెళ్ళికూతురాయెనే అని వింటాంకదూ" అంది చిలిపిగా.

"శారదా, నీకంత వేళాకోళంగా వుందిగదూ?"

"లేదు రాధా తమాషాకన్నానంతే. ఇంత త్యాగం చెయ్యాలంటే మాటలా! నేనే నీ పరిస్థితుల్లో వుంటే ఎక్కడికైనా వెళ్ళేదాన్ని గాని ఛస్తే చేసుకునేదాన్ని గాదు. నువ్వు నిజంగా..."

"కాదులే శారదా. ఎవరికివాళ్ళు అలా అనుకోడం మానవ నైజం. అంతేకాని ఈ పరిస్థితుల్లో ఎవరున్నా నాలా చేసేవాళ్ళే."

తల్లి దీనవదనం కళ్ళకు కట్టింది. ఆ వదనం ఎంత పనైనా చేయిస్తుంది! "జీవితంలో ఒడుదుడుకులకు ఇక ఆగగలవు తల్లీ సుమంగళీ భవ" దీవిస్తూ మాయమైంది ఆ ముఖం. తల్లి ఎదురుకుండా నిల్చి చేయలేని పని అదృశ్యంగా వుండి ఆమె వదనం చేయించిందా?

★